సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 11 । అక్టోబర్ । 2025



టీడీపీ నేతల దౌర్జన్యం

కొన్నేళ్ల క్రితం పట్టా భూమిని కొనుగోలు చేసి నివాసం ఉంటున్న కృష్ణానగర్‌లో టీడీపీ నాయకులు పట్ట పగలు దౌర్జన్యంగా శుక్రవారం ప్రహరీ నిర్మాణం చేపట్టారు -8లో



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో 'రాజకీయ కుట్ర'

ట్రాన్స్ ఫార్మర్లను రైతులకు ఏర్పాటు చేయడంలో చిక్కులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు రాజకీయ కుట్రలు శాపంగా మారాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.240
రెండోరకం	రూ.140	రూ.190

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 162 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	615	665
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 834.440 కిలోలు

న్యూస్‌రీల్

నూతన కమిటీ ఏర్పాటు

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లి గ్రామం సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయం నూతన ధర్మకర్తల మండలిని కమిషనర్ దేవాదాయ శాఖ విజయవాడ వారు నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈమేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ చైర్మన్‌గా జంగిటి రాజేంద్రప్రసాద్‌యాదవ్, సభ్యులుగా పి.మల్లీశ్వరి, పి.వసంత, బి.వెంకటసుబ్బయ్య, వి.కృష్ణయ్య, ఆర్.పార్వతమ్మ, సి.వెంకటసుబ్బయ్య, కె.రాజేశ్వరి, జె.శివారెడ్డి, కె.రూప నియమితులైనట్లు ఆయన తెలిపారు.

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే జీఎస్టీ తగ్గింపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. శుక్రవారం రాయచోటిలోని పంక్షన్‌హాల్‌లో జిల్లా వాణిజ్య పన్నులశాఖ, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వస్తువులను జీఎస్టీ తగ్గింపుపై సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన, ఎగ్జిబిషన్ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫ్రిజ్, మైక్రోవేవ్ ఓవెన్ టీవీలు, వాషింగ్ మెషిన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, వాణిజ్య పన్నులశాఖ, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న మధులత

మదనపల్లె సిటీ: న్యూఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి మొదటి పారా యోగసనా స్పోర్ట్స్' ఛాంపియన్‌షిప్-2025లో స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థిని జి.మధులత అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరించింది.ద్వితీయ స్థానం దక్కించుకుని సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. యోగసన భారత్ పోటీలు మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి దివ్యాంగులు పాల్గొన్నారు. వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగురాలైన మధులత యోగా మాస్టర్ అనిత వద్ద శిక్షణ తీసుకున్నట్లు పట్టుదలతో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నకిలీమద్యం కేసులో ప్రకంపనలు!

- జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డిలపై కేసుతో ఉత్కంఠ
- అరెస్టా..లొంగుబాటా?
- మిగిలిన నిందితుల అరెస్ట్‌కు ఎక్సైజ్ బృందాల గాలింపు
- ఏ-1 జనార్దనరావును అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు
- ములకలచెరువు ఎక్సైజ్ సీఐ సస్పెన్షన్



నకిలీమద్యం ప్లాంట్ (ఫైల్)



నకిలీమద్యం తయారీలో పట్టుబడిన నిందితులు (ఫైల్)

మదనపల్లె: ములకలచెరువు నకిలీమద్యం తయారీ ప్లాంట్ వెలుగులోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. నకిలీమద్యం తయారీ ప్లాంట్ ద్వారా మద్యాన్ని బెల్టుషాపులకు తరలించి ప్రజలచేత తాపించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిన ఈ కేసుపై ప్రభుత్వమే జోక్యం చేసుకుని టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిని పార్టీ నుంచి సస్పెన్షన్ చేశారు. తాజాగా ఆయనతోపాటు బామ్మర్ది మంత్రి గిరిధర్‌రెడ్డిలను నిందితులుగా చేర్చడంతో కేసు ప్రాధాన్యత మారిపోయింది. ఈ పరిస్థితుల్లో నకిలీమద్యం రాకెట్‌లో పాత్రధారులు ఇప్పటికే రిమాండులో ఉన్నారు. మిగిలిన వారిలో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దనరావును గన్నవరం విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ముఖ్యులైన జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డిలు లొంగిపోతారా లేక అరెస్ట్ అవుతారా అన్నది ఉత్కంఠ నెలకొంది. ఈనెల 3న కేసు నమోదవ్వగా, తనకు ఈ వ్యవహారంలో సంబంధం లేదని, ఇండియాకి వస్తున్నాని, తాను కడిగిన ముత్యంలా ఆరోపణల నుంచి బయటపడతానంటూ జయచంద్రారెడ్డి మూడు సెల్ఫీ వీడియోలను విడుదల చేశారు. వాటిని ఎక్కడినుంచి విడుదల చేశారో తెలియదు.

డైరీ ఆధారంగా ముందుకు..

ఓ నిందితుని నుంచి స్వాధీనం చేసుకున్న డైరీ, ల్యాప్‌టాప్ ద్వారా కేసు దర్యాప్తు ముందుకు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇందులో ఆర్థిక లావాదేవీలు, నకిలీమద్యం సరఫరా, పంపిణీ వివరాలు వెలుగులోకి వచ్చాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలో కొన్ని మినహా అన్ని మద్యం దుకాణాలు టీడీపీ నేతలు, వారి మద్దతుదారులవే. దీంతో నకిలీమద్యాన్ని ఆయా దుకాణాల పరిధిలోకి బెల్టుషాపులకు విక్రయించినట్టు స్పష్టం అవుతోంది. ఈ డైరీలోని వివరాలతో అధికారులు ముందుకువెళ్తే మరిన్ని ఆధారాలు లభ్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎక్సైజ్ సీఐ సస్పెన్షన్

తాజాగా ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందు సస్పెన్షన్ అధికార వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆమెను విజయవాడ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో ఆమె పాత్రపై అందిన ఆధారాలతో సస్పెన్షన్ అయినట్టు ఎక్సైజ్ అధికారులు చెప్పారు. అధికార పార్టీ నేతల నకిలీమద్యం తయారీకి సహకరించి వారితో అంటకాగిన మిగిలిన వారిపై వేటు తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. హిమబిందుకు ముందు పనిచేసిన ఓ సీఐ వ్యవహారశైలిపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆమెపైనా విచారణ జరగాలన్నా వాదనలు వినిపిస్తున్నాయి. నకిలీమద్యం తయారీ ప్లాంట్ మొదలైనప్పటి నుంచి పనిచేసిన ఎక్సైజ్ అధికారులపై విచారణ సాగుతుందని సమాచారం. దీనితో ఇంకెంత మంది చర్యలకు గురి అవుతారో వేచిచూడాలి.

సంఖ్య పెరిగే ఛాన్స్



నకిలీమద్యం తయారీ కేసులో నిందితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈనెల మూడున 12 మందిపై నమోదుచేయగా విచారణలో మరో ఇద్దరిని నిందితులు చేశారు. వీరికి తోడు మరో ఏడుగురిని చేర్చగా మళ్లీ మరో ఇద్దరిని చేర్చడంతో ఇప్పటికి ఈ కేసులో నిందితుల సంఖ్య 23కు చేరింది. కేసు దర్యాప్తు ముగింపు కు వచ్చేలోగా నిందితుల సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నారు. కాగా అరెస్ట్ చేయాల్సిన నిందితుల కోసం ఎక్సైజ్ పోలీసు బృందాలు ఆంధ్రా-కర్ణాటకల్లోని వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.



దాచిపెట్టారా

ములకలచెరువు నకిలీ మద్యం తయారీ రాకెట్ వ్యవహారంలో అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తున్నారు. నకిలీమద్యం తయారీపై ఇక్కడ ప్రభుత్వ శాఖలు నివేదించడంలో విఫలమయ్యారా లేక దాచిపెట్టారా అన్నది చర్చనీయాంశమైంది. ఎప్పటికప్పుడు నిఘా ఉంచి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాల్సిన స్థానిక అధికారులు చిత్తశుద్ధితో పనిచేయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఈ వ్యవహారంలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న వారిపై లోతైన విచారణ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏడాది కాలంలో ఇక్కడ సీఐలుగా ఎవరెవరు పనిచేశారు, అప్పటినుంచి పనిచేస్తున్న సిబ్బంది, నిందితులతో సఖ్యతగా ఉంటున్న వారు ఎవరు, వారితో ఆర్థిక లావాదేవీలు ఏమైనా జరిగాయా, ఇంకా ఇతర కోణాల్లో విచారణ చేయనున్నట్టు సమాచారం. బ్యాంకు ఖాతాలతో సహా సాంకేతికంగా ఆర్థిక లావాదేవీల వివరాలు సేకరించనున్నట్లు తెలుస్తోంది.

'పీఎం ధనధాన్య కృషి యోజన'జిల్లాకు ఒకవరం

- 20 పాయింట్ల కార్యక్రమం చైర్మన్ లంక దినకర్



మాట్లాడుతున్న లంక దినకర్, పక్కన కలెక్టర్ నిశాంత్ కుమార్ తదితరులు

రాయచోటి: ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన కార్యక్రమం జిల్లాకు వరం కానుందని 20 పాయింట్ల కార్యక్రమం చైర్మన్ లంక దినకర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి అక్టోబర్ 11న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించే ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏపీలో నాలుగు జిల్లాలను ఇందులో భాగస్వామ్యం చేసినట్లు, జిల్లాకు చోటు లభించడం అతిపెద్ద వరమని లంక దినకర్ అన్నారు. ఈ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఆరేళ్లపాటు ఏటా రూ. 24 వేల కోట్లు కేటాయిస్తారన్నారు. వ్యవసాయంలో తక్కువ ఉత్పాదకత, క్లిష్టతర వ్యవసాయ పరిస్థితులు, సగటున తక్కువ వ్యవసాయ రుణాలు తీసుకునే పరిస్థితులు ఉండే జిల్లాను ఆకాంక్షిత వ్యవసాయ జిల్లాగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటల మార్పు, సానుకూల వ్యవసాయ పద్ధతులను అనుకరించేలా చేయడం, పంచాయతీ, బ్లాక్ స్థాయిలో పంటకోత, అంతర పంట నిల్వకు అవసరమైన చర్యలు, నీటి వనరుల లభ్యతను పెంచడం, స్వల్ప, దీర్ఘకాలిక రుణాల లభ్యత అనే ఐదు లక్ష్యాలతో ఈ పథకం అమలవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ధనధ్యాన కృషి యోజన కార్యక్రమానికి జిల్లా ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఉద్యానవనం, ఇతర అనుబంధ రంగాలు జిల్లాలో అభివృద్ధి చెందుతాయని ఆకాంక్షించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి: జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ ధీరజ్ కునిబిల్లితో కలిసి కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్‌పై జిల్లాలో ఇప్పటి వరకు గ్రామాల్లో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. జనవరి 1 నుంచి అక్టోబర్ 10 వరకు 8 గంజాయి కేసులు పెట్టి 51.05 కేజీలు సీజ్ చేసినట్లు చెప్పారు. 38 మంది నిందితులను గుర్తించి వారిలో 33 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం డ్రగ్స్, గంజాయి నేరం, డ్రగ్స్ వద్దు స్కిల్ ముద్దు, డ్రగ్స్ వద్దు బ్రో, పోస్టర్లను జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ తదితరులు ఆవిష్కరించారు.

- ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగకుండా జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతోపాటు త్వరిత గతిన కేసులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులకు సంబంధించి ఎక్కడ అన్యాయం జరగకుండా పోలీసుశాఖ తరపున చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి అరాచకాలను అరికడదాం

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



తిమ్మిశెట్టిపల్లిలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

రైల్వేకోడూరు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆగడాలని అడ్డుకుందామని రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.శుక్రవారం తిమ్మిశెట్టిపల్లి అరుంధతివాడలో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, దోచుకోవడం పరిపాటిగా మారిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు తీసుకొస్తే అందులో ఏడు కళాశాలల నిర్మాణం పూర్తి చేసి పనులు నిర్మాణ దశలో ఉండగానే కమీషన్లకు కక్కుర్తిపడి వాటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో వాటికి వ్యతిరేకంగా ప్రజా అభిప్రాయ సేకరణ పేరుతో ముందుకు వచ్చామన్నారు. 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సంతకాలు చేసి తమ అభిప్రాయాలను తెలియజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోడూరు ఎంపీపీ ధ్వజారెడ్డి, పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, పంజం వేణుగోపాల్ రెడ్డి, గుత్తి హరినాథ్ రెడ్డి, వెంకటరెడ్డి, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు భరత్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సుబ్బరామరాజు, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ నందా బాల, సీహెచ్ రమేష్, నాగేంద్ర, ధనుంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పోరుబాట



- కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోవడంతో ఆగ్రహం
- అసెస్మెంట్ బుక్‌ను పునఃసమీక్షించాలంటూ డిమాండ్
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన విధానం కొనసాగించాలని పట్టు
- బోధనేతర పనుతో పాఠాలకు దూరమవుతున్న ఉపాధ్యాయులు



బోధనేతపనులు బహిష్కరిస్తున్నట్లు ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీచర్ల సంఘ నాయకులు (ఫైల్)

మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కంచకపోగా వారిపై బోధనేతర పనుల భారాన్ని మోపుతూ బోధనకు దూరం చేస్తోంది. ఫలితంగా విద్యార్థులకు చదువు దూరమవుతోంది. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోగా తమపై పని భారం మోపుతున్నారంటూ టీచర్లు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం అంచలంచలుగా పోరుబాట బట్టారు.

- కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. అడ్డగోలు నిర్ణయాలతో ఉపాధ్యాయుల మీద మరింత ఒత్తిడి పెంచింది. విద్యార్థులకు చదువులు చెప్పకుండా ఇతర పనులు అప్పగించడంతో సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నారు. దీంతో ఉపాధ్యాయుల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. చంద్రబాబు తన ప్రచార యావతో యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టి ఉపాధ్యాయులను స్కూళ్లను దూరం చేశారు. టీచర్స్ సమావేశాల పేరుతో దాదాపు రెండు వారాల పాటు ఉపాధ్యాయులు పాఠాలకు దూరమయ్యారు. దీనికితోడు రకరకాల శిక్షణ పేరుతో బడులకు వెళ్లలేకపోయారు. ఫలితంగా విద్యార్థులు సైతం చదువులకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం ఆంక్షలతో కొంత కాలం మౌనం వహించిన ఉపాధ్యాయ సంఘాలు పోరుబాట పట్టాయి. ఫ్యాప్టో పేరుతో శుక్రవారం నుంచి భోధనేతర పనులు,విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరించారు.

ఉపాధ్యాయులు డిమాండ్లు ఇవీ:

- ఏకీకృత సర్వీసు రూల్స్ పరిష్కరించి 72,73,74 జీవోలు అమలు చేయాలి.
- పంచాయతీరాజ్‌లో పెండింగ్‌లో ఉన్న కారణ్య నియామకాలు తక్షణమే చేపట్టి, కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగులు ఇవ్వాలి.
- సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.
- ఉపాధ్యాయులకు బోధన తప్ప బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలి.
- విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికం అని చెబుతూ బలవంతంగా అమలు చేయడాన్ని విడనాడాలి.
- అసెస్మెంట్ పుస్తకాలను పునః సమీక్షించాలి.
- హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే ఉపాధ్యాయ నియమాలు చేపట్టి, హైస్కూల్ ప్లస్ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి
- 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి.
- 30 శాతం మధ్యంతర భృతిని (ఐఆర్) వెంటనే ప్రకటించాలి.
- రిటైర్ అయిన వారికి గ్రాట్యూటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి బకాయకిలను రిటైర్ అయిన మరుసటి రోజునే చెల్లించాలి.
- సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి గ్రేడ్-2 పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి.
- మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- ఈహెచ్ఎస్/ మెడికల్ రీయింబర్స్‌ంట్ బిల్లుల విషయంలో నిత్యం ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కిరంచాలి.
- మండల విద్యాశాఖ అధికారులు బదిలీలు తక్షణమే చేపట్టాలి
- 2008,1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.
- బదిలీ అయి సబ్‌స్టిట్యూట్ లేక రిలీవ్‌కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి చర్యలు తీసుకోవాలి.

ఉపాధ్యాయులకు కొత్త సమస్యలు:



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు కొత్త సమస్యలు వచ్చిపడ్డాయి. విద్యార్థులకు చదువు చెప్పడం కంటే కూడా బోధనేతర పనులతోనే తలముకలయ్యేలా ప్రభుత్వం ఒత్తిడి చేస్తుంది. పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనలను పట్టించుకోవడం లేదు.

-రెడ్డప్పరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు

సమస్యల సాధనకు పోరాడతాం



సమస్యల సాధనకు పోరాడతాం. ఫ్యాప్టో ఆద్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి బోధనేతర పనులు, విద్యాశక్తి పనులు నిలిపివేశాం. ఉపాధ్యాయులకు బోధనేత పనులు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలి.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.

-పురం వెంకటరమణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

వెంటిలేటర్‌పై పేదల ఆరోగ్యం


- ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో పూర్తిగా నిలిచిన వైద్య సేవలు
- 'ఎన్టీఆర్ వైద్య సేవ'లపై 'పచ్చ' నీడలు



రాయచోటి: 'ఎన్‌టీఆర్ వైద్యసేవ' (ఆరోగ్య శ్రీ) పథకం అస్తవ్యసగా మారింది. ఈ పథకంలో భాగంగా కార్పొరేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే ప్రధాన ఉద్దేశం. అయితే ప్రభుత్వం ఈ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పెండింగ్ బిల్లులు రూ.కోట్లల్లో పేరుకుపోయాయి. దీంతో ఆసుపత్రుల యాజమాన్యాలు 'బకాయిలు చెల్లిస్తే గాని తాము కోలుకోలేము..పేదలకు ఉచిత వైద్యం అందించలేము' అని చెప్పాయి.

- ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో గడిచిన సెప్టెంబర్ నెలలో ఉచిత ఓపీ సేవలను నిలిపేసి తమ నిరసనను తెలిపారు. తాజాగా శుక్రవారం నుంచి పూర్తిగా అన్ని వైద్యసేవలను నిలుపుదల చేశారు. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు గత్యంతరం లేక సంపూర్ణంగా వైద్యసేవలను బంద్ చేశారు. గుండె, న్యూరో తదితర పెద్ద జబ్బులకు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనే వైద్యసేవలు లభిస్తాయి. ఇప్పుడు పూర్తిగా వైద్యసేవలను నిలుపుదల చేయడంతో పేదల బాధలు వర్ణనాతీతంగా మారాయి.
- సూచనలు, సలహాలు ఇవ్వడానికి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యమిత్రల డెస్క్ ఉంటుంది. ఇక్కడికి యథాలాపంగా వచ్చే రోగులకు వైద్యమిత్రల బంద్ జరుగుతోంది. వైద్యసేవలు అందుబాటులో లేవు. మీరంతా రాయచోటి, మదనపల్లె రాజంపేట, పీలేరు పట్టణాల్లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లేదా ఇతర ప్రభుత్వాసుపత్రులకు వెళ్లండని సలహా ఇస్తున్నారు. దీంతో పెద్ద జబ్బు అయితే కడప రిమ్స్, తిరుపతి, మదనపల్లె జిల్లా ఆసుపత్రితో పాటు ఇతర ప్రభుత్వాసుపత్రులకు వెళ్తున్నారు. చిన్న సమస్య అయితే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఇక్కడ డాక్టర్ ఫీజు వంద రూపాయల నుంచి రూ.300 పైగా చెల్లిస్తున్నారు. వైద్య పరీక్షలకు ఎంత లేదన్నా రూ.300 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అదే స్కానింగ్‌కు అయితే రూ.7 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిలాలో డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో వైద్య సేవల బంద్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నారు.

పల్లెవైద్యం పడక



గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలల్లో వైద్యులు సమ్మెకు దిగడంతో పల్లె వైద్యం పడకేసింది. వైద్యుల న్యాయపరమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఏమాత్రం చొరవ చూపలేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మధ్య తరగతి వర్గాల ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల బాటపట్టారు. చేతిలో చిల్లి గవ్వలేక పోయినా అప్పులతో ఆసుపత్రుల గడపలు తొక్కుతూ కన్నీటిపర్యంతం అవుతున్నారు.

జిల్లాలో 'ఎన్‌టీఆర్ వైద్యసేవ' వివరాలు

నెట్‌వర్క్ ఆసుపత్రులు :	32
అందులో ప్రభుత్వాసుపత్రులు:	11
ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు:	21
ఎన్‌టీఆర్ వైద్యసేవల ద్వారా వర్తించే వ్యాధుల సంఖ్య:	3,255
ఒక రోజుకు వచ్చే రోగులు:	2,000

క్లుప్తంగా

సంబేపల్లెలో చోరీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన నివాసం ఉంటున్న చింతం రంగారెడ్డికి చెందిన ఇంట్లో గురువారం రాత్రి పన్నెండు గ్రాముల బంగారం చోరీ అయినట్లు పోలీసులు తెలిపారు. రంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు వెళ్ళడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగుల కొట్టి ఇంటిలోకి ప్రవేశించి పది గ్రాముల గొలుసు, రెండు గ్రాముల ఉంగరాలు దొంగలించుకు పోయినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : తాగునీటి విషయంలో ఓ వ్యక్తిని కట్టెతో దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ నాగన్నకోటకు చెందిన తండ్రీ, కొడుకులైన మల్లికార్జున, చరణ్, మధులు కలసి అదే గ్రామానికి చెందిన గండికోట వెంకటేష్‌పై దాడి చేసి గాయపరిచారన్నారు. బాధితుడి భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేడినీళ్లు మీద పడి బాలుడికి తీవ్రగాయాలు

మదనపల్లె రూరల్ : వేడినీళ్లు మీద పడి బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. వేపూరికోటకు చెందిన నాగరాజ, సుహాసిని దంపతుల కుమారుడు పృథ్వీ(5) ఇంట్లో ఆడుకుంటుండగా, స్టవ్‌పై అన్నం వండేందుకు ఉంచిన వేడినీళ్లు ప్రమాదవశాత్తు శరీరం మీద పడ్డాయి. దీంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్సలు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..


గాయపడిన నారాయణ

మదనపల్లె రూరల్ : ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని వేంపల్లె పంచాయతీ జంగాలపల్లెకు చెందిన నారాయణ(50) శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఓ కాలేజీలో చదువుతున్న తన కుమార్తె భావన(20)ను బైక్‌లో ఎక్కించుకుని ఇంటికి వస్తుండగా, చిప్పిలి సమీపంలో బెంగళూరు నుంచి రాయచోటికి వెళుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మల్లిక (28) వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో రాజకీయ కుట్ర

- పని మధ్యలోనే ఆపేసి వెనుదిరిగిన ట్రాన్స్‌కో సిబ్బంది
- కూటమి నాయకుల ఒత్తిడే కారణమంటున్న రైతు


రైతు పొలం వద్ద పనులు ఆపేసి వెళ్లేందుకు విద్యుత్ తీగలు చుడుతున్న సిబ్బంది


విద్యుత్ సామగ్రితో వచ్చిన ట్రాక్టర్

రాయచోటి అర్బన్ : రైతులు నెలల తరబడి కళ్లు కాయలు కాచే విధంగా ఎదురుచూస్తే తప్ప ట్రాన్స్‌కో అధికారులు రైతులకు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయడం లేదు. తీరా మంజూరైన ట్రాన్స్ ఫార్మర్లను రైతులకు ఏర్పాటు చేయడంతో అనేక విధాల చిక్కులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు రాజకీయ కుట్రలు కూడా రైతులకు శాపంగా మారుతున్నాయి. అందులో భాగంగానే శుక్రవారం ఒక సంఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు తాటిగుంట్ల సుబ్బారెడ్డి, ఆయన తమ్ముడు నారాయణ రెడ్డిలు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రాయచోటి మండలం శిబ్యాల గ్రామానికి చెందిన రైతు సుబ్బారెడ్డి, ఆయన తమ్ముడికి కలిపి అదే గ్రామంలో సుమారు 5.72 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమికి నీటి ఆధారం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడి ఏడాదిన్నర క్రితం బోరు వేయించుకున్నాడు. అప్పట్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుని, ఎస్టిమేట్‌కు సంబంధించి నగదు చెల్లించారు. ఇటీవల ఆ రైతుకు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మంజూరైంది. అయితే అధికారులు గత 10 రోజుల క్రితం రైతుకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి , ట్రాన్స్ ఫార్మర్ అమర్చేందుకు సిద్ధమయ్యారు . కానీ కూటమి నాయకుల ఒత్తిడి కారణంగా పనులు చేయకుండా ఆపేశారు. శుక్రవారం మరోసారి రైతు పొలం వద్ద అవసరమైన విద్యుత్ తీగలు, ఇతర సామగ్రిని తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. అయితే సగం పనులు చేసిన తరువాత కూటమి నాయకులు ఫోన్ ద్వారా ట్రాన్స్ కో అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో, అంత వరకు పనులు చేసి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను సైతం తొలగించి, తెచ్చిన సామగ్రిని తీసుకుని వెనుదిరిగి వెళ్లిపోయిన సంఘటన చోటుచేసుకుంది.



ఈ సందర్భంగా రైతు సుబ్బారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు సాక్షితో మాట్లాడుతూ కూటమి నాయకుడు, రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి తమపై కక్షతో గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరించామనే కారణంతో మంజూరైన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పనులను చేయనీయకుండా ట్రాన్స్ కో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి, పనులను పదే పదే ఆపుతున్నాడని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఆయనే ఈ విధంగా రైతులను ఇబ్బందులకు గురిచేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై రాయచోటి రూరల్ ట్రాన్స్ కో ఏఈ డానియల్ జోషెప్‌ను వివరణ కోరగా సుబ్బారెడ్డి అనే రైతుకు ట్రాన్స్ ఫార్మర్ మంజూరు అయ్యింది. పలు ఇతర కారణాల వల్ల శుక్రవారం పనులు ఆపేశామని, ఒకటి, రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.

చేయి కోసుకుని బావిలో దూకి ఆత్మహత్యాయత్నం

- బాధితుడిని కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్
- సకాలంలో స్పందించినందుకు ఎస్పీ ప్రశంస


ఆత్మహత్యకు ప్రయత్నించిన చెంగాచారిని తీసుకువస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ అమరనాథ్

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి చేతి నరాలు కోసుకుని బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సకాలంలో స్పందించిన ఏఆర్ కానిస్టేబుల్ బాధితుడిని కాపాడి ఆస్పత్రికి తరలించాడు. శుక్రవారం మదనపల్లెలో జరిగిన ఘటనకు సంబంధించి వివరాలిలా...కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కృష్ణమాచారి కుమారుడు చెంగాచారి(33) తన భార్య శశి, కుమారుడితో కలిసి గురువారం మదనపల్లె పట్టణం ఎస్టేట్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వచ్చాడు. స్థానికంగా ఆలయానికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నాడు. అయితే, శుక్రవారం ఉదయం కుటుంబ సమస్యల కారణంగా చెంగాచారి భార్య శశితో గొడవపడ్డాడు. ఆమె దూషించడంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి బయటకు వచ్చి పట్టణంలోని బెంగళూరు రోడ్డు మడికయ్యల శివాలయం వద్దకు చేరుకుని అక్కడే చేతి నరాలు కోసుకున్నాడు. కబరస్థాన్ పక్కన ఉన్న కోడిగుడ్డు బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బావిలోకి దూకే క్రమంలో లోపల ఉన్న చెట్టు కొమ్మలకు తగులుకుని వేలాడుతూ, ప్రాణభయంతో కేకలు వేశాడు. అయితే అదే సమయానికి మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఎస్.అమరనాథ్, పిల్లలను స్కూల్‌కు తీసుకువెళ్లేందుకు అటువైపు వచ్చాడు. చెంగాచారి పెడుతున్న కేకలు విని అటువైపు వెళ్లి బావిలో వ్యక్తి ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే ఓ తాడు తీసుకు వచ్చి మరొకరి సాయంతో బావిలోకి దిగి చెంగాచారిని బయటకు తీసుకువచ్చాడు. తన వాహనంలో జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి చేర్పించాడు. దీంతో బాధితుడికి ప్రాణాపాయం తప్పింది. విషయం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి దృష్టికి వెళ్లడంతో ఆయన ఏఆర్ కానిస్టేబుల్ అమరనాథ్‌ను అభినందించారు. విధి నిర్వహణలో నిబద్ధత చూపినందుకు ప్రశంసించారు. పోలీసు రివార్డుకు సిఫారసు చేశారు.

కదిరి మహిళ..మదనపల్లెలో అదృశ్యం

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన సోదరుడు


భాగ్యమ్మ(ఫైల్)

మదనపల్లె రూరల్ : సత్యసాయి జిల్లా కదిరికి చెందిన మహిళ మదనపల్లెలోని బంధువు ఇంటికి వచ్చి అదృశ్యం కావడంపై ఆమె సోదరుడు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కదిరి మండలం సున్నపుగుట్ట తండాకు చెందిన బాలాజీనాయక్ భార్య వి.భాగ్యమ్మ (35) తిరుపతిలో ఉన్న తమ్ముడు భాస్కర్ నాయక్ వద్దకు వెళ్లి అక్కడ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. సెప్టెంబర్ 24న మదనపల్లె పట్టణం బుగ్గకాలువలో నివాసం ఉంటున్న దూరపు బంధువు పూర్ణ ఇంటికి వచ్చింది. కొద్దిరోజులుగా అక్కడే వారితో పాటు ఉంటోంది. అయితే ఈనెల ఏడోతేదీ సాయంత్రం 5 గంటల సమయంలో భాగ్యమ్మ తమ్ముడు భాస్కర్‌నాయక్‌కు ఫోన్‌చేసి తనను మదనపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద పూర్ణ, ఆటోడ్రైవర్ రెడ్డి కొడుతున్నారని చెప్పింది. అనంతరం మరోసారి రాత్రి 10గంటల సమయంలో ఫోన్‌చేసి వారి ఇంటికి వచ్చి మరోసారి తనను కొట్టారని, తప్పించుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా ఇంటికి తీసుకెళ్లి బంధించారని చెప్పింది. అనంతరం ఆమె ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది. దీంతో భాస్కర్‌నాయక్, బంధువైన పూర్ణకు 8వతేదీ ఫోన్‌చేయగా భాగ్యమ్మ అప్పుడే వెళ్లిపోయిందని, తమ వద్ద లేదని సమాధానం ఇచ్చింది. రెండురోజుల పాటు భాగ్యమ్మ ఆచూకీ కోసం వెతికిన సోదరుడు భాస్కర్‌నాయక్ శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తన అక్క అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నిమ్మనపల్లె : ప్రేమిస్తున్నానని చెప్పి బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలానికి చెందిన ఓ బాలి క(17) మదనపల్లెలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ డిగ్రీ చదువుతోంది. ఈనెల 3న బాలికను కాలేజీ వద్ద నుంచి నిమ్మనపల్లె మండలం తవళానికి చెందిన కల్యాణ్ (20) అనే యువకుడు ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వస్తుండగా బాలిక కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ విషయమై బాలికను నిలదీయడంతో కల్యాణ్ తనను ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేసినట్లు చెప్పింది. తనను ద్విచక్రవాహనంలో బోయకొండ అటవీప్రాంతానికి తీసుకెళ్లి బలవంతం చేశాడని తెలిపింది. దీంతో యువకుడిపై బాలిక కుటుంబ సభ్యులు నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ ఆరోపణలపై యువకుడు తాను బాలికను మోసగించలేదంటూ పోలీస్‌స్టేషన్‌లో తన వాదన వినిపించాడు. అయినా బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెడ్ పోస్టాఫీసు ఎదుట ధర్నా


నిరసన తెలియజేస్తున్న తపాల ఉద్యోగులు

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరురోడ్డులోని హెడ్ పోస్టాఫీసు ఎదుట శుక్రవారం ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు భాగంగా తపాల ఉద్యమ జాతీయ నాయకుడు మహదేవయ్యను ఉద్యోగంలోకి తొలగించినందుకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సానుకూల సిఫార్సులను అమలు చేయని కారణంగా క్రామేడ్ మహదేవయ్య ఆధ్వర్యంలో 2023 డిసెంబర్‌లో నిరవధిక సమ్మె చేశామన్నారు. ఆనాడు సమ్మెకు నాయకత్వం వహించినందుకు చార్జిషీట్ ఇచ్చి ఈనెల 8వతేదీన ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. మహదేవయ్యను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాస్కర్, సర్దార్, విజయకుమార్, రామమూర్తి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్‌లో టీడీపీ నేతల దౌర్జన్యం



రహదారి లేకుండా ప్రహరీ నిర్మాణం పనులు చేపడుతున్న దృశ్యం, జెసీబీని అడ్డుకున్న స్థానికులు

- గృహాలకు దారి లేకుండా ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం
- చక్రం తిప్పుతున్న టీడీపీ నేత
- లబోదిబో మంటున్న స్థానికులు

రాజంపేట రూరల్ : కొన్ని సంవత్సరాల క్రితం పట్టా భూమిని కొనుగోలు చేసి నివాసం ఉంటున్న కృష్ణానగర్‌లో టీడీపీ నాయకులు పట్ట పగలు దౌర్జన్యంగా శుక్రవారం ప్రహరీ నిర్మాణం చేపట్టడం రాజకీయ వర్గాలలో చర్చానీయంశంగా మారింది. టీడీపీ అధికారంలోకి రాగానే సంబంధిత నాయకుల దౌర్జాన్యాలకు రెక్కలు వచ్చాయనేది సగటు మనిషి అభిప్రాయం. అది నిజం చేస్తూ శుక్రవారం ఉదయం కృష్ణానగర్‌కు గుత్తా చెంగయ్యనాయుడు కుమారులైన బుచ్చిబాబు, చిట్టిబాబులతో పాటు మనవడులు తమ మంది మార్బలంతో పాటు జేసీబీని తీసుకొచ్చారు. వచ్చి రావటం తోనే ఆర్ఎస్ రోడ్‌లోకి అను సంధానం అయిన రహదారిని ముందుగా దిగ్బందం చేశారు. అనంతరం ప్రహరీ కోసం వారికి నచ్చిన విధంగా ముగ్గుపిండి కొందరు పోస్తుంటే జేసీబీతో గాడి తీసేందుకు ప్రయత్నించారు. తమ ఇంటిలోకి వెళ్లేందుకు దారి లేకుండా ఎలా వేస్తారని గుణకల కుటుంబీకులు నిలదీశారు. విషయం తెలుసుకున్న ఆ వీధిలోని మిగతా కుటుంబాల వారు మీరు రహదారి లేకుండా చేస్తే మాకు దారి ఏలా అని అడ్డగించారు. వీరి మాటలను లెక్కలోనికి వేసుకోకుండా జేసీబీతో గాడీని తీయించేందుకు పూనుకున్నారు. ఇదే సమయంలో స్థానికులు జేసీబీ అడ్డుగా పడుకున్నారు. ఇంతలో అక్కడికి చ్చిన పోలిసులు అడ్డు తొలగమని హెచ్చరించారు. గుత్తా కుటూంబీకులకు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని పోలీసులు హెచ్చరించారు.

సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు ప్రారంభం


క్యారమ్స్ పోటీలను తిలకిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ ఇండియా జోన్ లెవెల్లో నందలూరులో టోర్నమెంట్ జరపడం ఎంతో సంతోషం అన్నారు. క్రీడాకారులకు, కళాకారులకు మేడా కుటుంబం ఎప్పుడూ తోడుగా ఉంటుందని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలలో కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనడం విశేషం. క్రీడాకారులకు మూడు రోజుల పాటు భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. కార్యక్రమంలో యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బిఎస్ శంకర్, సభ్యులు ఆర్ముగం విశ్వనాథ్, పల్లె గ్రీస్మంత్‌రెడ్డి, వేపగుంట శ్యామ్‌రాజ్, నాగభూషణం , శివకోటి, గురుప్రసాద్, జంగంశెట్టి హరిప్రసాద్, ముమ్మడిశెట్టి సుధాకర్, మండల జేసీఎస్ కన్వీనర్ కలీముల్లాఖాన్, మాజీ ఏజీపీ శమీవుల్లాఖాన్, ఆనాల మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణకు శారీరక దారుఢ్యం ముఖ్యం

- ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి కృషి
- ఎస్పీ ధీరజ్ కునుబిల్లి


ఏఆర్ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

రాయచోటి : పోలీసు సిబ్బంది విధి నిర్వహణకు మంచి ఆరోగ్యంతో కూడిన శారీరక దారుఢ్యం చాలా ముఖ్యమని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. శుక్రవారం రాయచోటిలోని జిల్లా పోలీసుల పేరెడ్ మైదానంలో ఆర్మడ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బంది నుంచి వీక్లీ పెరేడ్‌లో భాగంగా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు శాఖలో అంతర్గత క్రమశిక్షణతోపాటు సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. అనంతరం నిర్వహించిన పోలీసు దర్బార్‌లో ఆరోగ్య పరిరక్షణ (ఫిజికల్ ఫిట్‌నెస్), సంక్షేమం, వృత్తి నైపుణ్యం అంశాలపై దృష్టి సారించి కీలక ఆదేశాలు, స ఊచనలు జారీ చేశారు. ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యోగా, ధ్యానం, వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటూ మరింత ఉత్సాహంతో విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. సిబ్బందిలో మానసిక ఉల్లాసం, ఉత్సాహాన్ని పెంచడానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వివిధ అంశాలపై నిపుణులతో రిఫ్రెషర్ కోర్సులు నిర్వహిస్తామని వివరించారు. ఏఆర్ సిబ్బంది సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కారం చూపుతామని ఎస్పీ హామీ ఇచ్చారు. విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా కుటుంబ సభ్యులతో గడపాలని సిబ్బందికి సూచించరరాఉ. దర్బార్ అనంతరం సిబ్బంది సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకొని వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, ఆర్ఐ ఎం పెద్దయ్య, ఆర్ఎస్ఐలు, ఇతర ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

S. No.	'e'-Procurement Notice No.	Numer of Works	Estimate Contract Value (In Lakhs)
1.	28/GF/DEE/AE/2025-26 to 45/GF/DEE/AE/2025-26 & 47/GF/DEE/AE/2025-26 & 46/15th F.C/DEE/AE/2025-26	20	101.65
2.	Bid Document Download Start Date	10.10.2025 10.00 A.M	
3.	Bid Document Download End Date	27.10.2025 03.00 P.M	
4.	Last Date of receipt of Tender	27.10.2025 03.30 P.M	

మదనపల్లె జిల్లా కాబోతోందా...?

– నూతన భవన నిర్మాణాలకు స్థలం చదును


చదును కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

మదనపల్లె రూరల్ : మదనపల్లె జిల్లా కేంద్రంగా చేయాలంటూ గత కొంత కాలంగా అన్ని వైపుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జిల్లా కాబోతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. అందులో భాగంగా మదనపల్లెలో నూతన ఎస్పీ క్యాంపు కార్యాలయం, డీఎస్పీ కార్యాలయ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు అందాయి. శుక్రవారం స్థానిక డీఎస్పీ మహేంద్ర ఆదేశాలతో తాలూకా పోలీసుస్టేషన్ వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ పర్యవేక్షణలో ఎస్ఐలు శివకుమార్, అన్సర్‌బాషా చదును చేయించారు. రెండు రోజుల్లో జిల్లా ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి నూతన భవన నిర్మాణాలకు భూమి పూజ చేయనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం రోజంతా పోలీసు అధికారులు స్థలం చదును చేయించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఈ విషయమై డీఎస్పీ మహేంద్రను అడుగగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం, డీఎస్పీ నూతన కార్యాలయ భవన నిర్మాణాలకు అనుమతులు వచ్చిన విషయం వాస్తవమేనన్నారు. త్వరలోనే నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

దళితులకు అన్యాయం చేస్తుంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ స్పందించరా?

నిలదీసిన వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు



మాట్లాడుతున్న కురబలకోట ఎంపీపీ భూదేవి

మదనపల్లె : కురబలకోట మండలంలో దళితుల భూములను టీడీపీ నేతలు కొల్లగొడుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ప్రశ్నించారు. మదనపల్లెలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కురబలకోట ఎంపీపీ ఎం.జి.భూదేవి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు నక్కా రమాదేవి, నాయకురాలు రెడ్డికుమారి మాట్లాడారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ తంబళ్లపల్లె మాజీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి దళితుల భూములను లాక్కుంటున్నారని చెప్పారు. కడపక్రాస్‌లో హైవే పక్కన రూ.20 కోట్లు విలువ చేసే భూమిని మంత్రి మండిపల్లి బంధువు, అనుచరుడు ఆవుల సురేంద్రరెడ్డి, టీడీపీ తంబళ్లపల్లి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పీఏ టి.రాజేష్ పేరిట కొనుగోలు చేశారని తెలిపారు. ఈ భూమిని చదును చేసి ప్లాట్లు వేసి అమ్మేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యాలయాల్లో సామాన్యుల పనులు జరిగే పరిస్థితులు లేవని చెప్పారు. అలాంటిది దళితుల భూమికి గత కలెక్టర్ ఎన్‌వోసీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ములకలచెరువు నకిలీ మద్యం కేసు ఇప్పటికే రాష్ట్రంలో అలజడి సృష్టిస్తోందన్నారు. టీడీపీ నేతల నకిలీ మద్యం, భూదందాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. జయచంద్రారెడ్డి భూకబ్జాలు, నకిలీ మద్యం తయారీ, ఇసుక దందాలు చేయడమేగాక ప్రభుత్వభూమిని ఆక్రమించి స్టోన్‌క్రషర్ ఏర్పాటు చేశారని వారు చెప్పారు. ఈ సమావేశంలో అంగళ్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డి.ఆర్.ఉమాపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.ఆనందరెడ్డి, వసంతరెడ్డి పాల్గొన్నారు.

గ్లోబల్ ఇంటర్న్‌షిప్ విజయవంతం

– ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి


జగదీష్‌ను అభినందిస్తున్న ఏయూ అధినేత చొప్పాగంగిరెడ్డి

రాజంపేట : జర్మనీ ఆటోసాల్ వింటర్ స్కూల్ గ్లోబల్ ఇంటర్న్‌షిప్ విజయవంతం కావడం అభినందనీయమని అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి కొనియాడారు. శుక్రవారం ఆటోసాల్ వింటర్‌స్కూల్ గ్లోబల్ ఇంటర్న్‌షిప్ విజయవంతం కావడానికి కారణమైన వారిని అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ విద్యార్థి జగదీష్ సెప్టెంబరు 14 నుంచి 28 వరకు జర్మనీలో నిర్వహించిన గ్లోబల్ ఇంటర్న్‌షిప్ విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఏయూ ప్రో-చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి ప్రోత్సాహంతో స్పాన్సర్ చేశారన్నారు. కార్యక్రమాన్ని ఆర్ డీ డీన్ డా.శివరామిరెడ్డి సమన్వయం చేయగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.పవన్‌కుమార్‌రెడ్డి మద్దతు అందించారన్నారు. యూరోపియన్ ఆటోమొబైల్ పరిశ్రమ నిర్మాణం, పరిశోధన అవకాశాలు, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ఇండస్ట్రీ 4.0 సాంకేతికలపై విస్తృతమైన అవగాహనను విద్యార్థి జగదీష్ పొందారన్నారు. ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వీసీ సాయిబాబరెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

– జిల్లా మహిళా సోషల్ కౌన్సిలర్ ఫిమా అంజుమ్


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సోషల్ కౌన్సిలర్ ఫిమా అంజుమ్

రాయచోటి అర్బన్ : బాలికలకు సమాజంలో ఆకస్మికంగా ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా మహిళా సోషల్ కౌన్సిలర్ ఫిమా అంజుమ్, పారా లీగల్ సభ్యులు చంద్రకళ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ షిర్డిసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మహిళల పట్ల జరిగే అన్యాయాలు, అక్రమాలను ఏ విధంగా ఎదుర్కొవాలో తెలిపారు. మహిళా సాధికారిత , ఉమెన్ ఎంప్లాయ్‌మెంట్ గురించి తెలిపారు. జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ఆధారంగా ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ సర్వీస్, మహిళా, శిశు సంక్షేమ శాఖ డిపార్ట్ మెంట్ ద్వారా బాలికలకు, మహిళలకు రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. పని చేస్తున్న ప్రదేశంలో సమస్యలు, లైంగిక వేధింపులు ఉన్నప్పుడు వాటిని ఎలా ఎదుర్కొవాలో తెలియజేశారు. పెళ్లి తరువాత ఎదురయ్యే మానసిక, శారీరక సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు.

అమరావతికి ఆశావాహుల పరుగులు

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డిని నకిలీమద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కారణంగా ఆయన్ను పార్టీ అధిష్టానం సస్పెన్షన్ చేసిన విషయం తెలిసిందే. దీనితో ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్న టీడీపీ నేతలు మూడురోజులుగా అమరావతికి క్యూ కడుతున్నారు. నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు అక్కడే మకాం పెట్టారు. స్థానికంగా ఒకరిద్దరు నేతలు ఇన్‌చార్జ్ పదవిని ఆశిస్తూ అధిష్టానం వద్దకు వెళ్లి తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు.

నీటికోసం రోడ్డెక్కిన మహిళలు


ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

బి.కొత్తకోట : స్థానిక బాబాటాకీస్ ప్రాంతానికి చెందిన మహిళలు 40 రోజులుగా తమకు తాగునీటి సరఫరా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం బీరంగిరోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తూ నీళ్ల కోసం పడుతున్న ఇబ్బందులపై ఏకరువు పెట్టారు. రోడ్డుకు అడ్డంగా తాడుకట్టి రాకపోకలను అడ్డుకున్నారు. సమస్యను పరిష్కారించాలనీ, నీటిని సరఫరా చేయాలని అధికారులను విన్నవించినా చర్యలు తీసుకోలేదని మహిళలు పేర్కొన్నారు. నీళ్ల కోసం పడుతున్న ఇబ్బందులను పట్టించుకొని సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ ప్రమీల హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.